భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు



నరసన్నపేట: మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న పాస్టర్

నరసన్నపేట: స్థానిక పెద్దపేట రోడ్డులోని కల్వరి బాప్టిస్టు మినిస్ట్రీస్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వ తేదీ వరకూ వేడుకలు కొనసాగుతాయని పాస్టర్ జాన్ డేవిడ్ చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లోక శాంతికై ఏసును కీర్తిస్తూ ప్రార్థనలు చేశామన్నారు. పేద మహిళలకు వస్త్రదానం చేసినట్టు జాన్ డేవిడ్ తెలిపారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా లావేరు తహసీల్దార్ సాదు దిలీప్ చక్రవర్తి, డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బుచ్చిబాబు హాజరై క్రిస్టియన్లుకు శుభాకాంక్షలు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్ష, కార్యదర్శులు పి.గురుమూర్తి, శరత్‌కుమార్ ఉన్నారు.

సుందరంగా చర్చిలు

పాతపట్నం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని పాతపట్నంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిలను సుందరంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటున్నాయి. పాతపట్నంలోని ఆర్‌సీఎం, జెసీపీ పీఎం చర్చి, కల్వరీ గస్‌పాల్‌చర్చి, డబ్ల్యూఎంఈఈ చర్చితో పాటు కొరసవాడలో ఆంధ్రాబాపిస్టు చర్చిల్లో ఆదివారం ఉదయం నుంచే పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు.

చర్చిల్లో క్రిస్మస్ సందడి

మెళియాపుట్టి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిలో క్రిస్మస్ సందడి నెలకుంది. చర్చిలను విద్యుత్ కాంతులతో ఆలంకరించారు. ఆదివారం సాయంత్రం నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రం మెళియాపుట్టిలోని చర్చిలో పాస్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో పశువులపాకలో ఏస్తుక్రీస్తు జననం ఘట్టాన్ని ఏర్పాటు చేశారు.

ఏసు క్రీస్తు జీవితం ఆదర్శనీయం

ఆమదాలవలస రూరల్: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు మానవులను పాప విమోచనం చేసి, కాపాడేందుకు ఈ లోకంలో అవతరించారని రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జేజే మోహనరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి నాలుగో వార్డులో గేదెలవానిపేటలోని హౌస్ ఆఫ్ ప్రేయర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ వేడుకలను కేక్‌ను కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరుణామయుడైన ఏసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమన్నారు. ఏసుక్రీస్తు జననం మానవాళికి పండుగ రోజు అని, ప్రభువు మార్గాన్ని అనుసరించి ప్రతి ఒక్కరూ జాలి, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. ప్రేమామయుడైన ఏసుక్రీస్తు ఈ భూమిపై అవతరించిన శుభదినం క్రిస్మస్ పండగని, ఈ పండగను కన్నుల పండువగా జరుపుకోవడం చాలా ఆనందాయకమన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు అరుణ్ కుమార్, గంట బోర్నో, సంసోన్, అహరోన్ రాజ్ చార్లెస్, దీవెన జోస్వా, పాలరావు, అప్పలసూరి పాల్గొన్నారు.

ఏసు ప్రేమ స్వరూపుడు

జలుమూరు: ఏసుప్రభువు ప్రేమ స్వరూపుడని పాగోడు చర్చి పాస్టర్ ఓనేసీము అన్నారు. చెన్నయవలసలో చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. సంఘ కాపరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి..

కొత్తూరు: ఎస్ఎన్ కాలనీ, పారాపురం, కొత్తూరు, మహార్తాపురం, నివగాం, ఆకులతంపరలతో పాటు పలు గిరిజన గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకులను ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఎస్ఎన్ కాలనీలోని చర్చిలో పాస్టర్ పీవీ రమణ పేదలకు చీరలు పంపిణీ చేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సెల్‌ఫోన్‌తో చేకూరే అనార్థాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కేక్‌లను కట్ చేసి ఏసు క్రీస్తు జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు.



ఆమదాలవలస రూరల్: సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మోహనరావు



జలుమూరు: కేక్ కట్ చేస్తున్న పాస్టర్ ఒనేసీము



విద్యుత్ వెలుగుల్లో పాతపట్నంలోని ఆర్‌సీఎం చర్చి



పాతపట్నం: కొరసవాడలోని ఆంధ్రాబాపిస్ట్ చర్చి



కొత్తూరు: ఎస్ఎన్ కాలనీ చర్చిలో నాటిక ప్రదర్శన

ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్రిస్మస్ శుభాకాంక్షలు



ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని క్రైస్తవ కుటుంబ సభ్యులందరికీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఏసు క్రీస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం క్రిస్మస్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. లోక రక్షణ, శాంతి స్థాపన కోసం ప్రభువైన ఏసు మానవ అవతారంలో జన్మించారని అన్నారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండగ ఎంతో పవిత్రమైనది అన్నారు.

క్రీడాస్ఫూర్తి పెంచేలా 'ఆడుదాం-ఆంధ్రా'



ఆమదాలవలస రూరల్: 2-కే రన్‌ను ప్రారంభిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: యువతలో క్రీడాస్ఫూర్తి పెంచేలా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ జంక్షన్ నుంచి కృష్ణాపురం జంక్షన్ వరకు ఆదివారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా-2కే రన్‌ను చిరంజీవినాగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి క్రీడల గురించి వివరించారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ నెల 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరానికి మద్దతుగా ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గుర్తింపు లేని క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో తదితర క్రీడా పోటీలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, ఈవోపీఆర్డీ డి.గోవిందరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు డి.శ్యామలరావు, బి.రవికుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, జె.వెంకటేశ్వరులు, బి.వి. రమణమూర్తి, పి.శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామసేవే రామసేవ



వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: గ్రామసేవయే రామసేవగా భావించి సత్యసాయి సేవాసంస్థల ద్వారా సమాజహిత కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమని బూర్జ ఎంపీపీ కర్నేని దీప అన్నారు. బూర్జ మండలంలోని హనుమయ్యపేట గ్రామంలో సత్యసాయి జోన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రామ సేవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నామసంకీర్తన, బాలవికాస్, వైద్యశిబిరం, సాయిరాం లిఖితనామ జపం చేశారు. వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. అలాగే వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా యూత్ కోఆర్డినేటర్లు సాయికృష్ణ, కుమారి, జ్యోతి, యూత్ ఇన్‌చార్జిలు పవన్, నదియా, జోనల్ కన్వీనర్లు జనార్దనరావు, సూర్యారావు, వెంకటరావు, విజయాస్పత్రి వైద్యులు సాయిశంకర్, సహాయకులు సందీప్ ఉన్నారు.

ఎస్సై ఉద్యోగం సాధించిన నాగమణికి అభినందనలు



నాగమణిని అభినందిస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఇందుకు నిదర్శంగా బమ్మిడి నాగమణిని చెప్పుకోవచ్చని విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. పెద్దకోట గ్రామానికి చెందిన సాధారణ వ్యవసాయ కూలీ ఇంట్లో పుట్టి ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోనే చదువుకుంటూ మొదటి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగం సాధించిన నాగమణిని ఆదివారం అభినందించారు. శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. ప్రతీ విద్యార్థి నాగమణిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉన్నతమైన లక్ష్యంతో విద్యార్థులు చదువు కొనసాగించాలన్నారు. అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు.

గృహ సారథికి సత్కారం



సంతోష్‌కుమార్ సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

నరసన్నపేట:

స్థానిక మారుతీనగర్ పరిసర వీధుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గృహసారథిగా పని చేస్తున్న డబ్బీరు సంతోష్‌కుమార్ సేవలను అభినందిస్తూ శిష్టకరణ సంఘం ప్రతినిధులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ మాట్లాడుతూ.. గృహ సారిథిగా పార్టీ సూచనలు మేరకు బాధతగా పనిచేస్తూ సంతోష్‌కుమార్ తన పరిధిలోని కుటుంబాల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. ఇదే కార్యక్రమంలో విశాఖ సీతమ్మధార శిష్టకరణ సంఘం కోశాధికారి చొదరి రమేష్‌ను కూడా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్(బుజ్జి), పలువురు శిష్టకరణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజలు



భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

నరసన్నపేట: స్థానిక గీతామందిరంలో ధనుర్మాసం ఏడో పాసురం సందర్భంగా ఆదివారం గోదారంగనాథుల స్వరూపంగా సీతారామ చంద్ర స్వాముల వారికి ఊయల సేవ నిర్వహించారు. అనంతరం మహిళలు భగవద్గీత పారాయణం చేపట్టారు. ఆద్యంతం ఈ కార్యక్రమం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. గీతామందిరం అర్చకులు సూరిబాబుపాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సత్సంగంలో మాట్లాడుతున్న వక్తలు

సారవకోట: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతోందని ప్రవచన కర్త రామశేషు అన్నారు. బుడితి గ్రామంలో ఆధ్మాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో 89వ ఆధ్యాత్మిక సత్సంగమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక పెరిగితే మనుషుల మధ్య అంతరాలు, ఆర్థిక అసమానతలు తగ్గుతాయన్నారు. దీంతో సమాజాభివృద్ధి, దేశాభివృద్ధి జరుగుతోందన్నారు. ధనుర్మాసంలో నిర్వహించే పూజలు ఎంతో శ్రేయోదాయకమన్నారు. రోజూ భగవద్గీత పారాయణం చేయడం వలన నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: ప్రజలు విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు బంగ్లాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతపట్నం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి కన్వీనర్‌గా మెళియాపుట్టి మండలానికి చెందిన వైద్యుడు సలాన శరత్‌కుమార్, కోకన్వీనర్‌గా కొత్తూరు మండలానికి చెందిన కె.ప్రసాదరావులను నియమించామన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, నాయకులు సలాన సంఘవరావు, రాణి ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

నరసన్నపేట: స్థానిక పెద్దపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం వైభవంగా హనుమత్ వ్రతం నిర్వహించారు. బ్రహ్మశ్రీ వనమాలి రామకృష్ణ, గోపురం బాల శరత్ చంద్రచార్యుల ఆధ్వర్యంలో హనుమత్ వ్రతం, సుందరాకాండ పారాయణం, స్వామి వారి విశేష అలంకరణ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మత్స శాంతి, షణ్ముఖరావు, శివశంకర్ ఉన్నారు.

క్లుప్తంగా

ముగిసిన 24 గంటల భజన



భక్తిగీతాలు ఆలపిస్తున్న భజన బృందం సభ్యులు

సారవకోట: గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామంలో శనివారం ప్రారంభమైన 24 గంటల భజన కార్యక్రమం ఆదివారం ఉదయంతో మగిసింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గ్రామంలోని రామాలయంలో 24 గంటల భజనా కార్యక్రమం చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భజన బృందాలు హాజరయ్యాయి.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ వ్రతం



హనుమాన్ వ్రతం చేస్తున్న భక్తులు

సారవకోట: మండల కేంద్రం సారవకోటలోని అభయాంజనేయ స్వామి మందిరంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ వ్రతం నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను మందిరం ఆవరణలో ఏర్పాటు చేసి రుత్వికులు లక్ష్మీనారాయణ శాస్త్రి భక్తులతో వ్రతాన్ని చేయించారు.

నృత్య ప్రదర్శనలో శ్రేయ ప్రతిభ



ప్లేటుపై ప్రదర్శన ఇస్తున్న శ్రేయ మిశ్రో

పాతపట్నం: విశాఖపట్నం షీలా నగర్‌లోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో నాట్యాచార్యులు అర్చన ఉషశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాతీయ అవార్డు గ్రహీత, దివ్యాంగురాలైన శ్రేయ మిశ్రా ప్రతిభ కనబరిచింది. శ్రేయ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆమె ప్లేటుపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి ప్రశంసలు లభించాయి. అనంతరం కమిటీ సభ్యులు శ్రేయ మిశ్రోను సత్కరించారు.

భక్తి శ్రద్ధలతో అయోధ్య అక్షింతలకు శోభాయాత్ర



అక్షింతలకు శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు స్పర్శ కార్యక్రమంలో భాగంగా మాకివలస గ్రామంలో ఆదివారం భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. నరసన్నపేటలోని వేంకటేశ్వరాలయంలో భద్రపరించిన తీసుకువచ్చిన అక్షింతలను కమిటీ సభ్యులు ఇక్కడకు తీసుకువచ్చారు. రామాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలోని ప్రతిఇంటికీ జనవరి ఒకటో తేదీన పంపిణీ చేస్తామని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో మాకివలస రామాలమం అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామ శాస్త్రి, వీహెచ్‌పీ సభ్యులు శ్రీనివాసరావు, రాజు మోహన్, రామ జోగారావు ఉహన్నారు.

ఆమదాలవలస వినియోగదారుల ఫోరానికి గుర్తింపు



చిరంజీవి నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ధనుంజయరావు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలసలోని ఫెడరేషన్ ఆఫ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ శాఖకు బెస్ట్ ఆర్గనైజేషన్‌గా గుర్తింపు లభించిందని ఆ శాఖ అధ్యక్షుడు తాళాబత్తుల ధనుంజయరావు తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించడంలో ఆర్గనైజేషన్‌కు ఈ గుర్తింపు లభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ చైర్మన్ బగాది రామ్మోహన్, జిల్లా సివిల్ సప్లయి అధికారి డి.వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ చిత్తశుద్ధికి ధాన్యం కొనుగోలే నిదర్శనం

● ఎమ్మెల్యే ధర్మాన క్రిష్ణదాస్



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. డీఎల్ పురం సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే నేడు వ్యవసాయాన్ని పండుగలా మార్చాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశంలోనే ఆదర్శవంతంగా రైతుల కోసం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు అన్ని అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమౌతోందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ఎంతో అభిమానం ఉంది కాబట్టే అత్యంత ప్రాధాన్యత అంశాల్లో వ్యవసాయాన్ని మొదటిస్థానంలో ఉంచామని వివరించారు. రబీలో కూడా ఆరుతడిపంటకు శివారు కాలువలకు సైతం సాగునీరు అందించేందుకు వంశధార అధికారులు పూర్తిస్థాయి కసరత్తు చేస్తున్నారన్నారు. రైతులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగి నాయుడు, స్థానిక సర్పంచ్ తమ్మినేని వెంకటరత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు చింతు సింహాచలం, చింతాడ భీమారావు, గురువు బాలకృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు పోటీతత్వం అవసరం



బహుమతులు పొందిన విద్యార్థులు, సత్యసాయి సభ్యులు

ఆమదాలవలస రూరల్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను అధిరోహించగలరని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు అన్నారు. అక్కులపేట గ్రామంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలను ఇటీవల నిర్వహించినట్టు పేర్కొన్నారు. అందులో సమితి లెవెల్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, రిటైర్డ్ డిప్యూటీ ఈవో వెంకట్రావు, జిల్లా గ్రామ సేవా ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, రాష్ట్ర విద్యా జ్యోతి ఇన్‌చార్జి గురుప్రసాద్, జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ సాయి కృష్ణ, పవన్, సమితి కో ఆర్డినేటర్లు వెంకటరావు, సాయి, పోలినాయుడు, శ్రీదేవి, షణ్ముఖ ఉన్నారు.

సాంకేతిక విద్యను అలవర్చుకోవాలి



పాతపట్నం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: విద్యార్థులు సాంకేతిక విద్యను అలవర్చుకోవాలని పాతపట్నం, సారవకోట, హిరమండలం ఎంఈవోలు బి.శ్రీధర్, ఎం.వెంకటరమణ, కె.రాంబాబు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో మహేంద్ర టాలెంట్ టెస్ట్-2 ప్రతిభ పరీక్షను ఆదివారం నిర్వహించారు. 38 పాఠశాలకు చెందిన 792 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. డివిజన్‌స్థాయి టాలెంట్ టెస్ట్ పరీక్షల్లో అమర జ్యోతి పాఠశాలకు చెందిన విద్యార్థినులు బి.కవిత, బి.హరిక, జి.నీలమలు ప్రతిభ కనబర్చారు. విజేతలకు శాసనపూరి కామేశ్వరరావు ప్రతిభా పురస్కారాలను, సర్టిఫికెట్లు, షీల్డు ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబు, ప్రిన్సిపాల్ ఎం.అంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అ'పూర్వ'కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

సరుబుజ్జిలి: బూర్జ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం జరిగింది. చదువుకున్న పాఠశాల ఆవరణలోనే 23 సంవత్సరాల తరువాత కలుసుకున్న వీరంతా ఆనందంతో గడిపారు. గ్రూపు ఫొటోలు తీసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో సత్య సాయి సేవాసంస్థల సభ్యులు

ఎల్.ఎన్.పేట: భగవాన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. శ్యామలాపురం గ్రామంలోని సత్యసాయి మందిరం వద్ద ఆదివారం విజేతలైన విద్యార్థులకు సత్యసాయి జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి మునగవలస రవీంద్రబాబు బహుమతులను అందజేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో లక్ష్మీనర్సుపేట, పూశాం, రావిచెంద్రి, కొమ్ముపలస, కరకవలస గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, లక్ష్మీనర్సుపేట గ్రామంలోని కేజీబీవీ పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని అన్నారు. సత్యసాయి భజన మండల కన్వీనర్ ఎ.నారాయణరావు, టి.దుర్గారావు, లావేటి శైలజ పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దాత వెంకటరమణ

మెళియపుట్టి: చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా విజయనగరం జిల్లా రాజాం నగర్ పునుగుటివలస గ్రామానికి చెందిన విశ్రాంతి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి వెంకటరమణ గిరిజనులకు దుప్పట్లను పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. గిరిజన గ్రామాలైన బంజీరు, చక్రినిధి, మర, కుయ్యోర, భరణికోట తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా గిరిజనులకు దుప్పట్లు, పంచెలు, చీరలతో పాటు యువకులకు ఉన్ని దుస్తులను అందించారు. మరో దాత బి.చక్రపాణి అన్నదానం చేశారు. గ్రామాల పెద్దలు బి.మన్మథరావు, కృష్ణారావు, సవర గోపాల్, అప్పారావు ఉన్నారు.